సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మణికొండ: అనారోగ్యంతో ఆస్పత్రులలో చికిత్సలు పొందితున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం వరంలా మారిందని మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ కాలనీకి చెందిన కె.నాగజ్యోతి కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవటంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును బుధవారం ఆమె భర్తకు ఆయన అందజేశారు. మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు బి.శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు కుమార్, లక్ష్మీశ్రీ, నాయకులు శ్రావణ్‌కుమార్, విజయరెడ్డి, శివగంగ, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తులసీరామ్ సేవలు యువతకు ఆదర్శం



తులసీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: దళితుల అభ్యున్నతికి నిరంతర పోరాటం చేసిన లోక్‌సభ మాజీ సభ్యుడు స్వర్గీయ తులసీరామ్ యువతకు ఆదర్శమని రాజేంద్రనగర్ జయంత్యోత్సవ కమిటీ అధ్యక్షుడు సూర్యం అన్నారు. బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ చౌరస్తాలో వి.తులసీరామ్ వర్ధంతిని నిర్వహించారు. తులసీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్‌లో జయంత్యోత్సవ కార్యక్రమాలకు పునాది వేసిన తులసీరామ్ సేవలను కొనియాడారు. దళితుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వెల్లడించారు. మూడుసార్లు పార్లమెంటుకు ఎన్నికైన గొప్ప దళిత నాయకుడు తులసీరామ్ అని గుర్తు చేశారు. తులసీరామ్ మనవడు కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు వర్రీ లలిత్ తులసీరామ్ మాట్లాడుతూ... తులసీరామ్ ఆశయ సాధన కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామన్నారు. నేతలు పోయిల జీవన్‌దాస్, పచ్చ శ్రీనివాస్, దాసరి రమేశ్, మంగలారం శ్రీనివాస్, పత్యార నర్సింహా, వేము వందనం, మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, పంబాల రాజు, పోయిల మోహన్ రావు, ఇట్యాల వెంకటేశ్, బలరాం, సంజీవ, ఎడ్లకాడి చంద్రశేఖర్, బర్ల సుమన్, కవ్వగూడెం జనార్దన్, ప్రసాద్, సంతోష్, చాంద్, నరేశ్, బబ్లూ, కోదూరి రాజు పాల్గొన్నారు.

వరంగల్ సభకు తరలిరావాలి: కార్తీక్‌రెడ్డి

శాస్త్రిపురం: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ పార్టీ వజ్రోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజేంద్రనరగ్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ సభ ద్వారా బీఆర్ఎస్ శక్తిని చాటాలన్నారు. రెండు డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సులేమానగర్, శాస్త్రీపురం డివిజన్‌ల అధ్యక్షులు మహమద్ జహీరుద్దీన్, ఎం.డి.ముక్రమ్‌ఖాన్, నేదతు అబ్దుల్ రహమాన్, ఆదిరాల రవి, అమీర్, మక్బూల్, సోహైల్, షరీఫ్‌ఖాన్, ఇమ్రాన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణిస్తున్న నార్సింగివాసి



ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అందుకున్న ఖలీల్, కోచ్ జయంత్‌రెడ్డి

మణికొండ: అంతర్జాతీయ తైక్వాండో పోటీలలో నార్సింగికి చెందిన బాక్సర్ ఖలీల్ రాణించారు. ఏకంగా నాలుగు పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించాడు. గతంలోనే అనేక పోటీలలో పాల్గొని పతకాలను సాధించిన ఖలీల్ మరో మారు తన సత్తా చాటారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఇంగ్లండ్‌లో జరిగిన తైక్వాండో కరాటే పోటీలలో అతను ఒక బంగారు, రెండు వెండి, ఒక బ్రాంజ్ మెడల్‌లను సాధించారు. బుధవారం జరిగిన ఓవరాల్ చాంపియన్ షిప్ పోటీలలోను రాణించి పతకాన్ని సాధించారు. దాంతో నాలుగు పతకాలతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించి 12 దేశాల క్రీడాకారులలో అగ్రగామిగా నిలిచారు. అతని క్రీడా నైపుణ్యాన్ని అన్ని దేశాల ప్రతినిధులు అభినందించారని కోచ్ జయంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ... అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తమ నార్సింగి నాయకులు, కోచ్ జయంత్‌రెడ్డి ప్రోత్సాహమే కారణమన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని పతకాలను సాధించి దేశానికి మంచి పేరు తెస్తానన్నారు.



చౌదరిగూడ శివారులో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



పెద్దషాపూర్-నర్కూడ రోడ్డులో ప్రమాదకరంగా ఫెన్సింగ్ కడీలు

రోడ్ల విస్తరణ పూర్తయ్యేనా?

- అర్ధంతరంగా ఆగిన రోడ్ల పనులు
- భూవివాదాలు, కోర్టు కేసులతో సాగని వైనం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పాలకులు, అధికారుల్లో కొరవడిన చిత్తశుద్ధి
- వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



అసంపూర్తిగా ఉన్న రాయన్నగూడ-కేబీ దొడ్డి రోడ్డు

శంషాబాద్ రూరల్: అసంపూర్తిగా ఉన్న రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రూ. కోట్ల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. అధికారుల సమన్వయలోపం కూడా రోడ్ల అభివృద్ధికి ఆటంకగా మారుతోందనే ఆరోపణలూ లేకపోలేదు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు రహదారులను అనుసంధానం చేసే రోడ్ల విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోతున్నాయి. ఏళ్ల నుంచి పనులు ముందుకు సాగడంలేదు.

పెద్దషాపూర్-నర్కూడ దారి...

పెద్దషాపూర్ నుంచి వయా చౌదరిగూడ మీదుగా నర్కూడ వరకు చేపట్టిని రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రూ. 3.65 కోట్ల వ్యయంతో పనులు మొదలుపెట్టారు. చౌదరిగూడ శివారులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పట్టా భూములు వివాదాస్పదంగా మారి పనులు నిలిచిపోయాయి. మట్టి రోడ్డును బీటీగా అభివృద్ధి చేస్తుండగా.. సుమారు అర కిలోమీటరు దూరం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ ఉన్న నక్ష బాటపై స్పష్టత కొరవడడంతో ఇరు పక్కల ఉన్న భూ యజమానులు వివాదానానికి తెరలేపారు. దీంతో పనులు ఆగిపోయాయి. ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణంతో పాటు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న రోడ్డుకు ఒక వైపు వేసిన ఫెన్సింగ్ కడీలు ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళలో వచ్చే వాహనదారులకు ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది.

రాయన్నగూడ-కేబీ దొడ్డి మార్గం...

శంషాబాద్-షాబాద్ రహదారి నుంచి బీజాపూర్ రహదారిని అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన రోడ్డు విస్తరణ పనులు సైతం ఏళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్నాయి. రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ దారిలో వర్షాకాలం ప్రయాణం నరకంగా మారుతుంది. భారీ గుంతలు, వరదనీరు నిలిచి వాహనదారుల సహనానికి పరీక్షగా మారుతుంది. రాయన్నగూడ చౌరస్తా సమీపం నుంచి కేబీ.దొడ్డి వరకు కి.మీటరు దూరం వరకు పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఇక్కడ 800 మీటర్ల దూరం వరకు భూవివాదం కోర్టులో ఉండటంతో పనులు ఆగిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టరు ఈ ప్రాంతం మినహా రోడ్డు పనులు పూర్తి చేసి వెళ్లిపోయాడు. అసంపూర్తి రోడ్డు పనులు చేపట్టడానికి కోర్టు వివాదం అడ్డుగా మారింది. సమీపంలోని భూయజమానులు కోర్టుకు వెళ్లగా.. వారితో మాట్లాడి పనులు చేయించేందుకు పాలకులు శ్రద్ధ చూపడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.

తొండుపల్లి-హమీదుల్లానగర్ రహదారి...

బెంగళూరు జాతీయ రహదారి-ఔటర్ రింగు రోడ్డును అనుసంధానం చేస్తూ హమీదుల్లానగర్-తొండుపల్లి రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రూ. 36 కోట్ల వ్యయంతో ఈ పనులను 8 నెలల కిందట మొదలు పెట్టారు. అయితే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ కారణంగా రోడ్డు పనులు నిలిచిపోయాయి. వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకరకుప్పలు, మట్టి గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఒక్కోసారి ప్రమాదాల బారినా పడుతున్నారు.

బండ్లగూడ జాగీర్ ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తాగునీటి వసరులు, వార్డు వారీగా కార్యచరణ ప్రణాళిక, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల రీవెరిఫికేషన్, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన, ఎల్ఆర్ఎస్ సర్వే, వాణిజ్య ప్రకటనల పన్నుల వసూలు, పర్మనెంట్ మైగ్రేషన్ పెన్షన్స్ వెరిఫికేషన్, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫామ్ తయారీ, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వహణ తీరుపై చర్చించారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, స్వచ్ఛ సర్వేక్షణ్-2025 సిటిజన్ ఫీడ్ బ్యాక్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, అన్-అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నూతన పనులు చేపట్టడం, వన మహోత్సవం గల టార్గెట్స్ ప్రకారం మొక్కలు పెంచుట, నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీ నిర్వహణ, ఆర్థిక సంవత్సరం 2025-26లో టార్గెట్స్ తదితర అంశాలు.. చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అలాగే వివిధ వార్డులలో వీధి దీపాల నిర్వహణ, నూతన లైట్లు ఏర్పాటు... మరమ్మతు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణలపై చర్యలు, కోర్టు కేసుతు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో మేనేజర్ ఇ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



సమస్యలు వివరిస్తున్న బీఆర్ఎస్ నేత

అత్తాపూర్: ప్రజల మంచినీటి సమస్యలపై అధికారులు దృష్టి సాధించి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. అత్తాపూర్‌లో బుధవారం జలమండలి మేనేజర్ వినయ్‌తో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు నీటి సమస్యలపై పలు ఫిర్యాదులు చేశారు. లోప్రెజర్ సమస్యతో పాటు నీటి సరఫరాలో జాప్యం లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా అప్పారెడ్డి ముఖేష్ మాట్లాడుతూ అత్తాపూర్‌లో మంచినీటి సరఫరాలో జాప్యం, లోప్రెజర్ సమస్యపై మంగళవారం జలమండలి జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో బుధవారం జలమండలి మేనేజర్ వినయ్, సిబ్బంది అత్తాపూర్‌కు చేరుకొని సమస్యలను పరిశీలించారన్నారు. శాశ్వత పరిష్కారాలు చూపించి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. నాయకులు పుప్పాల లక్ష్మణ్, మల్లేష్‌యాదవ్, జగన్, సతీష్ పాల్గొన్నారు.

20న కోట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని చరిత్రాత్మకమైన కోట మైసమ్మ దేవాలయ పునర్నిర్మాణం అనంతరం మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వార్షికోత్సవ వివరాలను వెల్లడించారు. సంవత్సరం క్రితం బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. ఎంతో మహిమ గల ఈ దేవాలయాన్ని పునర్నిర్మాణంలో బుద్వేల్ గ్రామ ప్రజలతో పాటు దాతలు తమ సహాయ సహకారాలు అందించారన్నారు. దేవాలయ పునర్నిర్మాణం అనంతరం మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు వివరించారు. వార్షికోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం దేవిచౌక్ చెందిన లీలా కృష్ణ మోహన్ తన తల్లిదండ్రులు పేరిట మూడు తులాల బంగారు ఆభరణాలను అమ్మవారికి చేయించారని వెల్లడించారు. కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని అన్నదాన కార్యక్రమం జరగనుందన్నారు. రేవపల్లి రాజు శర్మ, సందీప్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేరాల నియంత్రణపై పోలీసుల ఫోకస్



మధుబన్ కాలనీలోని దుకాణం.. ఆటోను తనిఖీ చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: నిషేధిత గుట్కాలు, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని వీటిని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ, ఎస్ఐ పైడినాయుడు హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధుబన్ కాలనీలో బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలతో పాటు కిరాణా దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. నెంబర్ ప్లేట్లు, సరైన దస్తావేజులు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నేరాలను నియంత్రించడానికి ఎప్పటికప్పుడు నాకాబందీ, కార్డన్ సర్చ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. చాలా ప్రాంతాల్లో నిషేధిత గుట్కాలు, గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు తమకు పక్కా సమాచారం అందుతున్నదన్నారు. వీటి అమ్మకాలను తాము ఉపేక్షించమని వెల్లడించారు. అర్ధరాత్రి దాటిన కొంత మంది రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నామన్నారు. ఇప్పటికే పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. అయినా కొంత మంది మారకుండా అలాగే వ్యవహరిస్తున్నారని ఈసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ యువత తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి జోలికిపోతే వారి జీవితాలు నాశనం అవుతాయని వారు స్పష్టం చేశారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించండి

మణికొండ: అసలే ఇరుకుగా ఉన్న రోడ్లపై ప్రజలకు మరింత ఇబ్బంది కలిగించేలా ఫుట్‌పాత్‌లు, బుల్కాపూర్ నాలా, గండిపేట క్యాండూట్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను తొలగించాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెన్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఫెడరేషన్ నాయకులు అధికారులను కోరారు. బుధవారం మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావును కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ఐదు సంవత్సరాల్లో రోడ్ల ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కాలనీల్లో అవసరం ఉన్న చోట కొత్త రోడ్లు వేయాలని, రోడ్లపై గుంతలను పూడ్చాలని, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. నెక్నాంపూర్ చెరువులలో మురుగునీరు కలవకుండా డైవెర్షన్ పైప్‌లైన్‌లు వేయాలని కోరామన్నారు. రాబోయే వర్షాకాలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, అలకాపూర్ టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, పందెన్‌వాగును పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పార్కులలో టాయిలెట్స్, వాకింగ్ ట్రాక్‌లను మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. తిరుమల హిల్స్ కాలనీలోని పార్కు స్థలాన్ని కోర్టు వివాదం నుంచి బయటకు తెచ్చి అభివృద్ధి చేయాలన్నారు. త్వరలోనే తాము సూచించిన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, డీఈ శివసాయి, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లాలమ్మ గార్డన్స్‌లో బీఆర్ఎస్ నేతల పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న సీతారాం

మణికొండ: ప్రజలకు సౌకర్యాలను కల్పించేలా చేయాల్సిన అభివృద్ధి పనులు కాంట్రాక్టర్‌లకు మేలు జరిగేలా నాసిరకంగా కొనసాగించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. బుధవారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా లాలమ్మ గార్డన్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా తమ వార్డులో, కాలనీలో సమస్యలే లేవని చెపుతున్న మాజీ ప్రజాప్రతినిధులు ఒక సారి కాలనీల్లో పర్యటించాలన్నారు. లాలమ్మ గార్డన్ రోడ్డు నెంబర్ 4లో వేసిన డ్రైనేజీ పనులు నాసిరకంగా జరగటంతో కొద్ది పాటి వర్షం కురిస్తే నీరంతా రోడ్లపై నిలుస్తుందన్నారు. ఆస్థి పన్నులను ఇష్టారాజ్యంగా వేయటంతో ప్రజలు చెల్లించేందుకు విముఖత చూపడటంతో పాటు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆయన అన్నారు. మంచినీటి సరఫరా నిర్ణీత సమయం లేకుండా ఎపుడు పడితే అపుడు వారి ఇష్టం వచ్చినంత సమయమే వదలటంతో అది సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీల్లో వీధి కుక్కల సమస్య విపరీతంగా ఉందని, రోడ్ల పక్కన వేస్తున్న చెత్తను ఏ రోజుకు ఆ రోజు తొలగించకపోవటంతో దుర్గంధం, దోమల వ్యాప్తికి కారణం అవుతుందన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి లాలమ్మగార్డన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ మణికొండ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి.బాబు, శ్రీకాంత్, కిరణ్, శ్రీనివాసచారి, భానుచందర్, సుమనళిని, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మిక సమస్యలపై అవిశ్రాంత పోరు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత నర్సింహ

శంషాబాద్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించే మహాసభలను విజయవతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు... తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డుకు పాలకవర్గం సైతం ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం మినమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. భవన నిర్మాణ రంగం నుంచి కార్మికుల సంక్షేమానికి సేకరిస్తున్న సెస్‌లు సైతం పక్కదారి పడుతున్నాయన్నారు. అడ్డా కూలీలు ఉండే చోట కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21, 22 రెండు రోజులు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. తొలిరోజు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎంఎంఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు నర్సింహారెడ్డి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి
- వేసవిలో మరింత అప్రమత్తత అవసరం
- రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



బి.శ్రీనివాస్

అత్తాపూర్: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని.. ఈ విషయంలో ప్రతి ఒక్కరికీ మరింత అవగాహన ఉండాలని రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం అత్తాపూర్‌లోని తన కార్యాలయంలో 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వంట గదులు విశాలంగా ఉండాలని పూర్తి అయ్యేంత వరకు స్థిరంగా అక్కడే ఉండాలని ఆయన సూచించారు. గ్యాస్ సిలిండర్ లీకేజీ పట్ల తెలిసి ఉండాలని లీకేజీ జరిగిన వెంటనే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు ఫిర్యాదు చేయాలన్నారు. పొరపాటున వంట చేసే క్రమంలో బాండ్లీలో నూనెకు మంటలు అంటుకున్న క్రమంలో గోనెసంచికి లేదా మందంగా ఉండే దుప్పట్లతో ఆ మూకుడుపై వేయాలని ఆయన చెప్పారు. సిలిండర్‌కు మంటలు అంటుకున్న ఎలాంటి గాబరా పడకుండా భయభ్రాంతులకు గురి కాకుండా రెగ్యులేటర్ నుంచి సిలిండర్‌ను చేసి వేరు చేసి ఖాళీ ప్రదేశంలో సిలిండర్‌ను వేయాలని తెలిపారు. వంట పూర్తి అయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని అన్నారు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్న నేపథ్యంలో సిగరెట్, బీడీ తాగి ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. స్క్రాప్ దుకాణాలు, గోదాములు పలు పరిశ్రమలలో ఇలాంటి ఘటనలు వల్ల ప్రమాదాలు సంభవిస్తూ భారీ ప్రాణనష్టం జరుగుతుందని తెలిపారు. అగ్నిమాపక సాధనాలను తమ అపార్ట్‌మెంట్‌లో పిల్లలు కార్యాలయంలో ఆఫీసుల్లో పరిశ్రమలలో కచ్చితంగా ఉండి తీరాల్సిందేనని శ్రీనివాస్ తెలిపారు. గ్యాస్ సంబంధించిన ఏ వస్తువులనైనా డైరెక్ట్‌గా వెల్డింగ్ చేయరాదని అందులో పూర్తి శాతం నీటిని నింపిన తర్వాత మాత్రమే వెల్డింగ్ చేసేందుకు సిద్ధపడాలన్నారు. ఇటీవల ఓ పెట్రోల్ ట్యాంకర్‌ను నేరుగా వెల్డింగ్ చేస్తున్న క్రమలో ట్యాంకర్ బ్లాస్ట్ అయ్యి ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

